నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
శుక్రవారం | డిసెంబర్ 08, 2023 | www.navatelangana.com

మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరం

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ పురపాలక సంఘం పరిధిలోని 74 మంది కార్మికులకు సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్, ఈ -గ్రీన్ వర్క్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ సహకారంతో స్థానిక అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో రాంనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్వేత, సూపర్వైజర్ మతీన్, ఇతరులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు నిర్వహించారు. పలు ఆరోగ్య సూత్రాలు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



నిరాశ్రయురాలికి చేయూత

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్‌లోని సంజీవయ్యకాలనీలో చంటిబిడ్డతో తిరుగుతున్న ఒక మహిళకు సఖీ కేంద్రం నిర్వాహకులు చేయూత అందించి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారి సావిత్రి తెలిపిన ప్రకారం..చంటి బిడ్డతో ఓ మహిళ సంజీవయ్యకాలనీలో తిరుగుతున్నట్లుగా తెలుసుకున్న శిశు సంక్షేమ శాఖ అధికారి సావిత్రి సఖీ కేంద్రం నిర్వాహకులతో అక్కడికి చేరుకొని ఆమెను పునరావాస కేంద్రానికి తరలించారు. ఆమె వివరాలు తెలుసుకున్నారు. ఆమె భర్త మధ్యప్రదేశ్‌లోని మానస జిల్లాలో ఉంటున్నట్లు తెలుసుకున్న అధికారులు అతనికి సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించి రప్పించారు. వారిద్దరి మధ్య ఉన్న విభేధాలను తొలగించేందుకు కౌన్సెలింగ్ ఇప్పించారు. అనంతరం వారిద్దరిని మధ్యప్రదేశ్ తరలించారు. ఇందులో చురుకుగా పని చేసిన సఖీ కేంద్ర సిబ్బందిని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి సావిత్రి అభినందించారు.



పెంబిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-నిర్మల్

కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ పెంబి మండలాన్ని ఆస్పిరేషన్ మండలంగా గుర్తించడం జరిగిందని, ఆ మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి టాప్ ర్యాంక్ సాధించాలని జిల్లా పాలనాధికారి ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. గురువారం మినీ సమావేశం మందిరంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం ఏర్పాట చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం విద్య, వైద్యం, ఐసీడీఎస్ ఆరోగ్యపోషణ, చదువు, వ్యవసాయం నీటి వనరులు ఆర్థిక చేరిక, నైపుణ్యాభివృద్ధి, రహదారి, త్రాగునీరు, గ్రామీణ విద్యుదీకరణ, వ్యక్తిగత గృహ మరుగుదొడ్లతో సహా ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఉద్దేశించిన నీతి అయోగ్ కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారులుపెంబీ మండలం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లా ప్రణాళిక సూత్రీకరణ నీతి ఆయోగ్ జిల్లా ప్రణాళికలను రూపొందించి టాప్ ర్యాంక్‌ను సాధించాలని అధికారులకు సూచించారు. ఎక్కడ కూడా తప్పులకు అస్కారం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుబంటి దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-కడెం



ఎలుగుబంటి దాడిలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైసంపేట్ గ్రామానికి చెందిన ఆడ మహేందర్ మేకలు కపరి. తన మేకలను కాయడానికి అడవికి వెళ్ళి తిరిగి వస్తుండగ ఎలుగు బంటి దాడి చేసింది. దీంతో ఆ యువకుడి తలకు తీవ్ర గాయలయాలు కావడంతో అక్కడే పడిపోయాడు. సమీపంలో ఉన్న వ్యక్తులు గమనించి మహేందర్‌ను ఉట్నూర్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఎలుగుబంటి సంచారం ఉన్నందున అడవిలో ఎక్కువ సమయం ఉండవద్దని గ్రామస్తులు సూచిస్తున్నారు.

క్రీడాకారులకు యూనిఫామ్ అందజేత



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని ఆష్టా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చిన తొమ్మిది మంది బాలికలు అండర్ 18 ఖోఖో పోటీలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని అభినందించి గ్రామ వీడీసీ తరపున సుమారు రూ.8 వేల విలువ గల యూనిఫామ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుకన్య రమేష్, వీడీసీ చైర్మెన్ ముసుకు సాయిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌తో బాలుడి మృతి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన ఆకు లక్ష్మీ రాజేశ్వర్ల కుమారుడు రిషి(12) బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. బాలుడికి రెండేళ్ల క్రితమే బ్రెయిన్‌లో రక్తపు గడ్డలు వ్యాపించడంతో అనేక సార్లు ఆపరేషన్లు చేయించారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స నిర్వహిస్తుండగా గురువారం వేకువజామున మృతి చెందినట్టు, కుటుంబ సభ్యులు తెలిపారు. బాలుడి మరణవార్త విన్న గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు.

అమాత్యులెవరో..?

- మంత్రివర్గ రేసులో ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్
- తొలి దఫాలో ఉమ్మడి జిల్లాకు దక్కని పదవి
- మలిదశలో జిల్లా ఎమ్మెల్యేలకు చోటుపై ఉత్కంఠ
- ఎవరిని వరిస్తుందోనని సర్వత్రా ఆసక్తి

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డితో పాటు మరో పదకొండు మంది మంత్రులు సైతం ప్రమాణ స్వీకారం చేశారు. కానీ తాజాగా ప్రకటించిన మంత్రివర్గ కూర్పులో తొలి దఫాలో రాష్ట్రంలోని ఆరు ఉమ్మడి జిల్లాలకు మాత్రమే ప్రాతినిధ్యం కల్పించగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మాత్రం చోటు లభించలేదు. తొలి నుంచి మంత్రివర్గంలో చోటు లభిస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతో పాటు చెన్నూర్ ఎమ్మెల్యే డా.వివేక్ వెంకటస్వామి పేర్లు వినిపించినా తాజాగా ప్రకటించిన జాబితాలో మాత్రం పరిగణనలోకి తీసుకోకపోవడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మంత్రివర్గంలో 19మంది వరకు తీసుకోవాల్సిన అవసరం ఉండగా.. ప్రస్తుతం 11మంది మాత్రమే ప్రమాణం చేయడంతో మిగిలిన ఎనిమిది స్థానాల్లో ఎవరికి చోటు దక్కుతుందోనని తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు ఎమ్మెల్యేలుగా విజయం సాధించగా.. వీరిలో అమాత్య పదవి ఎవరిని వరిస్తుందోనని సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల ఫలితాలు వచ్చాయి..కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోనూ నలుగురు ఎమ్మెల్యేలు గెలిచారు. ఇక వీరిలో ఎవరికి మంత్రి వస్తుందా.. అనేది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. తాజాగా గురువారం కొత్త ప్రభుత్వం కొలువు దీరడం.. అప్పుడే మంత్రివర్గ విస్తరణ కూడా జరిగింది. రాష్ట్రంలో 19మంది మంత్రులకు కేబినేట్‌లో స్థానం ఉండగా..ప్రస్తుతం ముఖ్యమంత్రితో పాటు 11మంది మంత్రులు మాత్రమే ప్రమాణ స్వీకారం చేశారు. మిగితా ఎనిమిది మందికి మంత్రివర్గంలో చోటు కల్పించాల్సి ఉంటుంది. ఈ ఎనిమిదో ఎవరికి ప్రాధాన్యం దక్కుతుందోనని తీవ్ర చర్చలు జరుగుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాలు ఉండగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో కేవలం నలుగురు మాత్రమే విజయం సాధించారు. రాష్ట్రంలో అధికారం దక్కినా.. ఆరు సీట్లను కోల్పోయింది. కానీ గెలిచిన వారిలో మంత్రి ఒకరిద్దరికి మంత్రి పదవి తప్పకుండా దక్కుతుందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల స్థానం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు మంత్రివర్గంలో పదవి ఆశిస్తున్నారు. ఇన్నాండ్లు పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాలో పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఇంద్రవెల్లి సభ మొదలుకొని వివిధ కార్యక్రమాలు చేపడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనుచరగణం కలిగిన ఆయనకు తొలి దశలోనే ఈ సారి మంత్రి పదవి దక్కుతుందని ప్రచారం జరిగింది. ఆయనతో పాటు ఇటీవల పార్టీలో చేరిన డా.వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి నుంచి గెలిచిన సీనియర్ నాయకుడు గడ్డం వినోద్‌కుమార్‌లు సైతం మంత్రి పదవి ఆశిస్తున్నారు.

ఎవరికి వరిస్తుందోననే ఉత్కంఠ..!

ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, ఖానాపూర్ నియోజకవర్గాల్లో హస్తం పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. మంచిర్యాల నుంచి గెలుపొందిన ప్రేమ్‌సాగర్‌రావు అత్యధికంగా సుమారు 66వేల మెజార్టీ సాధించారు. ఉమ్మడి జిల్లాలో సీనియర్ నాయకుడిగా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వర్గంగా ముద్రపడిన ఆయనకు తొలి మంత్రివర్గంలోనే చోటు లభిస్తుందని ఆశించారు. కానీ పదకొండు మంది జాబితాలో ఆయన పేరు కనిపించలేదు. మరోపక్క బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన డా.వివేక్ వెంకటస్వామి చెన్నూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. గతంలో ఎంపీగా పనిచేసిన అనుభవంతో పాటు ఉమ్మడి జిల్లాలో సీనియర్ నాయకుడిగా పేరు ఉంది. తాజా మంత్రివర్గంలో వివేక్‌కు చోటు లభిస్తుందని ప్రచారం జరుగుతోంది. కానీ తొలి దశలో మంత్రి పదవి దక్కలేదు. బెల్లంపల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన గడ్డం వినోద్‌కుమార్ సైతం మంత్రి పదవి ఆశిస్తున్నట్లు తెలిసింది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండటంతో ఈ సారి సైతం మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మరోపక్క ఖానాపూర్ నియోజకవర్గం నుంచి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టిన వెడ్మ బొజ్జు పటేల్ సైతం మంత్రి పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా ముద్ర ఉండటంతో పాటు గోండు సామాజిక వర్గానికి చెందిన ఈయనకు సామాజిక సమీకరణాల దృష్ట్యా మంత్రి మండలిలో స్థానం దక్కే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం తొలి దశ మంత్రి పదవులు పూర్తికాగా.. రెండో దశలో మిగిలిన స్థానాలను భర్తీ చేస్తారని తెలుస్తోంది. మలిదశ కేటాయించే మంత్రి పదవుల్లో ఈ నలుగురిలో ఎవరికి చోటు లభిస్తుందోనని సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.







సేవలు ఘనం..అభివృద్ధి శూన్యం

- సేవా కార్యక్రమాలపై పెట్టిన శ్రద్ధ అభివృద్ధిపై లేదు
- కోనేరు కోనప్ప ఓటమికి అదే కారణమా..?

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కోనేరు కోనప్ప, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానే కాదు రాష్ట్రంలో కూడా ఈ పేరు తెలుసు. ఎందుకంటే ఈయన చేసే సేవా కార్యక్రమాలను గుర్తించిన మాజీ సీఎం కేసీఆర్ పలుసార్లు ఆయన పేరును ప్రస్తావించారు. ప్రతి ఎమ్మెల్యే కోనప్పను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎండాకాలం అసెంబ్లీ నడుస్తున్న సమయంలో శాసనసభలో అంబలి పంపిణీ చేసి అంబలి కోనప్పగా పేరు పొందారు. ఇంత పేరు సంపాదించిన కోనప్ప ఎందుకు ఓడిపోయారు మరి. అంటే దీనికి ఒకే ఒక్క సమాధానం చెప్పవచ్చు. సేవా కార్యక్రమాల మీద పెట్టిన శ్రద్ధ అభివృద్ధి మీద పెట్టకపోవడమే ప్రధాన కారణం. ఎండాకాలం వచ్చిందంటే అంబలి పంపిణీ చేయడం, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇప్పించడం లాంటి కార్యక్రమాలు విరివిగా చేపట్టారు. అంతేకాకుండా గత కొన్నేళ్లుగా కాగజ్‌నగర్ పట్టణంలో నిత్యాన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేసి ప్రత రోజు మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నారు. ఏ మంత్రి వచ్చినా, ఎమ్మెల్సీలు వచ్చినా ఈ సత్రాన్ని చూపించడం వరకే పరిమితమయ్యాడు. ఈ సేవా కార్యక్రమాలు అభినందనీయమే అయినా అదే సమయంలో నియోజకవర్గ అభివృద్ధిపై కూడా దృష్టి సారిస్తే ఈ రోజు ఓటమి బాధ తప్పేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పదేళ్లలో అభివృద్ధి శూన్యం

గడిచిన పదేళ్ల కాలంలో నియోజకవర్గ అభివృద్ధి శూన్యమనే చెప్పవచ్చు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే సాగు, తాగునీటి రంగాలకు కొదవ ఉండదని భావించారు. కాని ఈ నియోజకవర్గంలో సాగునీటి పరంగా జరిగిన అభివృద్ధి శూన్యమే. అడ, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టుల నిర్మాణం గత పదేళ్లుగా ముందుకు జరగలేదు. దీనికి తోడు కౌటాల మండలానికి మంజూరైన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ఇక్కడి నుండి మేడిగడ్డకు తరలిపోయినా ఈ మాజీ ఎమ్మెల్యే ఏనాడూ నోరు మెదపలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా వార్దా నదిపై ప్రాజెక్టు నిర్మాణానికి హామీ ఇచ్చినా అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. పెద్దవాగు, ప్రాణహిత, పెన్‌గంగలపై పదుల సంఖ్యలో ఉన్న ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారినా, వాటిని ఉపయోగంలోకి తీసుకు రాలేదు. ఉచ్చమల్లి, బొక్కివాగు ప్రాజెక్టుల పరిస్థితీ అంతే. మిషన్ భగీరథ నీరు ఇప్పటి వరకు అన్ని గ్రామాలకు అందడం లేదు. కాగజ్‌నగర్‌లో దశాబ్ద కాలంగా నిర్మాణ దశలోనే ఉన్న 30 పడకల సామాజిక ఆసుపత్రి భవన నిర్మాణాన్ని ఇటీవలే అతికష్టం మీద పూర్తి చేసినా అందులో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది లేరు. సిర్పూరు ఆసుపత్రిలో కూడా ఇదే పరిస్థితి. సిర్పూరు పేపర్ మిల్లు కార్మికుల కష్టాలను ఈ మాజీ ఎమ్మెల్యే ఏనాడూ పట్టించుకోలేదు. కార్మికులకు వైద్య సదుపాయం కోసం ఏర్పాటు చేసిన ఈఎస్ఐ ఆసుపత్రి రేపో మాపో ఇక్కడి నుండి తరలిపోతున్నా, దానికి పూర్వవైభవం కోసం ఏనాడూ ఆయన ప్రయత్నం చేయలేదు. పోడు సమస్య అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో తూతూ మంత్రంగా ఇటీవలే కొంతమంది గిరిజనులకు పట్టాలిచ్చి చేతులు దులుపుకున్నారు. అటవీ ప్రాంతం కావడంతో ఇక్కడ రోడ్లు, వంతెనల నిర్మాణాలకు అటవీ అనుమతులు కావాల్సి వస్తోంది. అనుమతులు సకాలంలో రాకపోవడంతో ఏళ్ల తరబడి అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయి. అటవీ అనుమతులు తీసుకురావడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారు. సిర్పూరు (టి) మండలం వేంపల్లి వద్ద రైల్వే ఓవర్‌బ్రిడ్జి కొన్నేళ్లుగా అసంపూర్తిగానే ఉంది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ అమలుకాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి విస్తరణంతో తన పార్టీ నేతల భవంతులకు నష్టం జరుగుతుందనే ఏకైక కారణంగా సంవత్సరాల తరబడి రోడ్ల వెడల్పుకు ముందుకు రావడం లేదు.

సేవే పరమావధి అనుకున్నాడు ఆ ఎమ్మెల్యే. ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపడితే చాలు అభివృద్ధి మర్చిపోతారని భావించాడు. ప్రజలు కూడా ఏనాడూ ఆ ఎమ్మెల్యేను అభివృద్ధి గురించి నిలదీయలేదు. ఇంకేముంది.. నేను చేసే సేవా కార్యక్రమాలతోనే మళ్లీ గెలువచ్చని భావించాడు. కాని సేవ కాదు, మాకు అభివృద్ధి ముఖ్యమని భావించిన ప్రజలు ఆ ఎమ్మెల్యేను ఓడించారు. ఆ ఎమ్మెల్యేనే కోనేరు కోనప్ప.

దో నెంబర్ దందాలకు కొదవే లేదు

ఇక ఈ నియోజకవర్గంలో దో నెంబర్ దందాలకైతే కొదవే లేదు. మాజీ ఎమ్మెల్యే అండ చూసుకొని దో నెంబర్ దందాగాళ్లు రెచ్చిపోయారు. రేషన్ బియ్యం రీ సైక్లింగ్ విచ్చలవిడిగా సాగుతోంది. లిక్కర్ మాఫియా ఈ నియోజకవర్గంలో జరిగినట్లుగా ఎక్కడా జరగదనే ఆరోపణలు ఉన్నాయి. గుట్కా వ్యాపారం, మట్కా జూదానికి అడ్డకట్ట వేసే వారు లేరు. ఇసుక అక్రమ రవాణాదారులు రెచ్చిపోతున్నారు. మున్సిపాలిటీలో తన పార్టీ నాయకులే కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి నాసిరకం పనులు చేపట్టడం, పనులు చేపట్టకుండానే బిల్లులు లేపడం చేస్తున్నారు. భూ కబ్జాలు అనేకం. కౌటాల మండలంలో సొంత పార్టీ నాయకులే భూ కబ్జాలకు పాల్పడుతున్నా ఏనాడూ నోరు మెదపలేదు.



కోనప్ప నిర్వహించే నిత్యాన్నదాన సత్రం



రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఏర్పాటుపై ఆసిఫాబాద్‌లో సంబరాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో ఆయన ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ శ్రేణులు అంబేద్కర్‌చౌక్‌లో కాంగ్రెస్ నాయకుడు శ్యాంనాయక్ ఇంటి ఎదుట పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ప్రచార వాహనంతో కాలనీలలో తిరిగి సంబరాలు కొనసాగించారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆసిఫ్, జిల్లా నాయకులు మంగ, మురళి, గుండ శ్యామ్, శశి, సతీష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | డిసెంబర్ 08, 2023 | www.navatelangana.com

ఎమ్మెల్యేను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కడెం



ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్ యాదవ్, మాజీ మండల అధ్యక్షులు గొల్ల వెంకటేష్, పడిగెల భూషణ్, తాళ్లపెల్లి రమేష్, తుమ్మల గంగాధర్ ఉన్నారు.

ముధోల్‌లో కాంగ్రెస్ సంబరాలు

నవతెలంగాణ-ముధోల్



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గురువారం ప్రమాణ స్వీకారం చేయడంతో నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీతో తెలంగాణ అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గంగారెడ్డి, బి.ముత్యంరెడ్డి, రాజేష్, గోవింద పటేల్, పతంగి కిషన్, వెంకటేష్, ఖాలిద్ పటేల్, నగేష్, దిగంబర్, అజీజ్ పాల్గొన్నారు.

గెలిచినా ఓడినా ప్రజల మధ్యనే ఉంటా

- భూక్యా జాన్సన్ నాయక్



నవతెలంగాణ-ఖానాపూర్

ఎన్నికల్లో గెలిచిన ఓడిన ప్రజల మధ్యనే ఉంటూ సేవ చేస్తానని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలకు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికలలో పార్టీ కోసం పని చేసిన తీరును తాను ఎప్పటికి మరువలేనన్నారు. ఏది ఏమైనా ప్రజల తీర్పును స్వాగతించాల్సిన అవసరముందన్నారు. ఖానాపూర్‌లోనే ఉంటూ ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేస్తానన్నారు. గెలిచినా ఓడినా ప్రజల కోసం పోరాటం ఆగదని అన్నారు. కార్యకర్తలు అధైర్య పడవద్దని ఏ అవసరమున్నా తన దగ్గరికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

షిర్డీ మొక్కు తీర్చుకున్న బీజేపీ నాయకులు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్ రెడ్డి అత్యధిక మెజార్టీతో నిర్మల్ ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా బీజేపీ నాయకులు అయిండ్ల భూపాల్ రెడ్డి గురువారం షిర్డికి వెళ్లి సాయినాథుని వద్ద తన మొక్కులను తీర్చుకున్నారు. నామినేషన్ వేసిన తరువాత ఎమ్మెల్యేగా ఘనవిజయం సాదిస్తే షిర్డి వస్తానని మొక్కుకున్నారు. భారీ మెజార్టీతో గెలవడంతో షిర్డిలో సాయిబాబా సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసినట్టు ఆయన తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఈజ్‌గాం పోలీస్ స్టేషన్ పరిధిలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెంబర్-13 గ్రామానికి చెందిన భరుణ్ కుమార్ మండల్ ఇంట్లో సోమవారం రాత్రి చోరి జరుగగా నింధితుడిని గురువారం అరెస్టు చేసినట్టు ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. భరుణ్ కుమార్ ఇంటి ఆవరణంలోని తన పూజ మందిరంలోని హుండీని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని సుమారు రూ.45వేలు దొంగిలించారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రూ.42వేలు రికవరీ చేసి రిమాండ్‌కు పంపించినట్టు ఎస్సై తెలిపారు.

నీతిఆయోగ్ ఆస్పిరేషన్ బ్లాకుగా తిర్యాణి ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నీతిఆయోగ్ ఆస్పిరేషన్‌కు సంబంధించి దేశంలో 500 బ్లాకుల్లో తిర్యాణి ఉత్తమ బ్లాక్‌గా ఎంపికైందని జిల్లా కలెక్టర్ బోర్కడ హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం విద్య, వైద్యం, ఐసీడీఎస్ ప్రాజెక్టు చిన్నపిల్లలకు పోషకాహారం అందించడం, వ్యవసాయ, నీటి వసతి, నైపుణ్యత, వ్యవసాయ నీటి నిర్వహణ, నిర్మాణాలు లాంటి 9అంశాలపై గతంలో ఎంపికైన బ్లాక్‌లలో ప్రభుత్వం సర్వే నిర్వహించిందన్నారు. దీనిలో భాగంగా 500 బ్లాకుల్లో తిర్యాణి ఉత్తమ బ్లాక్ గా నిలిచిందని దీనికి కృషి చేసిన సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ బ్లాకుగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

సింగరేణి ఏరియా ఆస్పత్రి ఆవరణలో కారు బోల్తా



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణములో స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిలో గురువారం కారు బోల్తాపడింది. వివరాల్లోకి వెళ్తే సింగరేణి ఏరియా హాస్పటల్‌లోని ఇద్దరు ఫార్మసిస్టులు విధుల సమయంలో మద్యం సేవించి కారు నడుపుతూ హాస్పిటల్ చుట్టూ తిరుగుతూ వీరంగం సష్టించిచ్చారు. అలా తిరగుతున్న క్రమంలో పక్కనే ఉన్న మురికి కాలువలో కారు బోల్తా కొట్టింది. ఆస్పత్రి ప్రాంగణంలో ఇలా వీరంగం సృష్టించిన వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హక్కుల కోసం ఉద్యమిస్తున్న సీఐటీయూను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వీరయ్య

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికులను చైతన్యం చేస్తూ, నిరంతరం వారి హక్కుల కోసం పోరాడుతున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)ను గుర్తింపు సంఘ ఎన్నికల్లో గెలిపించాలని రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వీరయ్య అన్నారు. గురువారం బెల్లంపల్లి, గోదావరిఖని రిజియన్ నాయకుల కార్యకర్తల సమావేశం శ్రీరాంపూర్‌లోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అథితిగా హాజరై మాట్లాడుతూ సింగరేణిలో ఇప్పటి వరకు గుర్తింపు సంఘాలు ఒక పార్టీకి చెందిన వారు కాబట్టి సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారానికి యాజమాన్యం, ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేదన్నారు. నిధుల వినియోగం కూడా సరిగా చేయలేదని, దాని కారణంగా కార్మికులు చాలా నష్టపోయి అప్పుల పాలయ్యారని ఆవేధన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఐఎన్టీయూసీ బలపడిన అదే జరుగుతుందని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఐఎన్టీయూసీ ఏనాడు పోరాటాలు చేయలేదని, పోరాటాలకు ద్రోహం చేసిందని ఆరోపించారు. ఏఐటీయూసీ మూడు సార్లు గుర్తింపు సంఘంగా ఉందని కార్మికులకు గోదావరి త్రాగునీరు కూడా అందించలేకపోయిందన్నారు. కార్మికుల సంఖ్య లక్ష నుండి 45వేలలోపు రావడానికి కూడా ఏఐటీయూసీ చూపిన ఉదాసీనతనే కారమణమని ఆరరోపించారు. కోల్ ఇండియాలో చేసుకున్న ఒప్పందాలు, ప్రమోషన్స్, ఇంక్రిమెంట్, హై పవర్ కమిటీ వేతనాలు తదితర వాటిని ఇప్పించలేదన్నారు. అనేక హక్కులు పోవడానికి ముఖ్య కారణం ఏఐటీయూసీనే ప్రధాన కారణమని మండిపడ్డారు. సీఐటీయూ మొదటి నుండి సూత్రదాయ, బద్ధమైన వైఖరితో పోరాడుతుందని, అన్ని సంఘాలను కలిపి ప్రైవేటీకరణకు వ్యతిరేఖంగా పోరాటం చేయించడంలో ముఖ్యపాత్ర పోషించిందని గుర్తు చేశారు. సింగరేణిలో కార్మికులు 30, 40 సంవత్సరాలుగా పనిచేస్తున్న సొంత ఇల్లు నిర్మాణం చేసుకోలేకపోతున్నారన్నారు. ప్రస్తుతం ఈ సమస్య ప్రధానంగా ఉందని,దీనిని మిగతా సంఘాలు గుర్తించాయని అది సీఐటీయూ పోరాటాలే కారణమన్నారు. గుర్తింపు సంఘా ఎన్నికల్లో సీఐటీయూను గెలిపిస్తే సొంతింటి కల నిజం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, మంచిర్యాల జిల్లా కార్యదర్శి రంజిత్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ముత్యంరావు, అధ్యక్షులు కుమారస్వామి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షులు పి రాజారావు, అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నాగరాజు గోపాల్, శ్రీరాంపూర్ అధ్యక్ష, కార్యదర్శులు గుల్ల బాలాజీ, గోదారి భాగ్యరాజ్, మందమర్రి బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటస్వామి, అల్లి రాజేందర్, ఆర్జీ-1 కార్యదర్శి శ్రీనివాస్, ఆర్జీ-2 అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ ప్రవీణ్ కుమార్, సంతోష్, ఆర్జీ-3 కార్యదర్శి దొమ్మటి కొమరయ్య, బెల్లంపల్లి కార్యదర్శి అంబాల ఓదెలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి గురువారం మండల కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణను ఇచ్చామని, అదే విధంగా రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను పక్కగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు అన్ని విధులుగా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వొడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, అట్ల రాంరెడ్డి, సమ్మెట రవి, రాంరెడ్డి, నగేష్, పృథ్వి, వినేష్, రాజేందర్ పాల్గొన్నారు.



కడెం : ప్రమాణ స్వీకారానికి వెళ్తున్ననాయకులు



లక్ష్మణచాంద : ప్రమాణ స్వీకారానికి బయల్దేరుతున్న నాయకులు

కడెం: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన సీఎం ప్రమాణస్వీకార మహోత్సవానికి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ప్రొద్దుటూరు సతీష్‌రెడ్డి, నిర్మల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు తారి శంకర్, పట్టణ అధ్యక్షులు వాజీద్‌ఖాన్, మైనార్టీ మండల నాయకులు బబ్లు, రహీం, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బరుపటి రమేష్ పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం

- కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జావిద్‌ఖాన్

నవతెలంగాణ-కుభీర్

తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామని కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జావిద్ ఖాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పార్టీ కార్యకర్తలతో సంబరాలు నిర్వహించారు. అన్నాబావు సాఠే విగ్రహం వద్ద టపాసులు పేల్చి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డికి కుభీర్ మండల ప్రజలు, పార్టీ నాయకుల తరుపున శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన తొలి రోజున ఆరు గ్యారంటీలపై సంతకం చేసి వాటిని అమలు చేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలో ఇచ్చిన ప్రతి హామీలను నెరవేర్చేందుకు పార్టీ బాద్యత తీసుకుంటుందన్నారు. ముధోల్ నియోజకవర్గం నారాయణరావు పటేల్ ఆధ్వర్యంలో అభివృద్ధితో పాటు అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బషీర్, బంక బాబు, విలాస్, జేడీ రాం, మండల నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జావిద్‌ఖాన్

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ మధుసూదన్

నవతెలంగాణ-లక్ష్మణచాంద

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా బోధనలు చేయాలని ఎంఈఓ మధుసూధన్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని వడ్యాల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆర్.అశోక్ వర్మ అధ్యక్షతన పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. తరగతి గదిలో విద్యార్థులను వారివారి స్థాయిలో ఆధారంగా ప్రతిరోజు ప్రధానోపాధ్యాయులు పర్యావేక్షించాలని ఎంఈఓ సూచించారు. నొడల్ అధికారి పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు సంబంధించిన పాఠ్యాంశాల ప్లాన్స్, విద్యార్థుల వర్క్ బుక్‌లు, టెక్స్ బుక్, అభ్యాస దీపికలను తరగతుల వారీగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థులు తరగతి గదిలో సృజనాత్మకంగా గీసిన బొమ్మలను, పాఠ్యాంశాలను బోర్డుపై ప్రదర్శిస్తూ సృజనాత్మకత పెంపొందించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతి కాంప్లెక్స్ మీటింగ్‌లో ప్లాన్ ఆఫ్ యాక్షన్ అనే అంశాలపై ముందుగానే తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఆర్పీ సాయన్న, గోవర్ధన్, సీఆర్‌పీ సుధాకర్ పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగ సమయంలో కరెంట్ కట్

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం సమయంలో కరెంట్ సరాఫరా నిలిచిపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం ఉంటుందని గురువారం ఉదయం నుంచి ఆతృతతో ఎదురు చూసిన ప్రజలు నిరాశకు లోనయ్యారు. ముఖ్యమంత్రి ప్రసంగించే సమయంలోనే విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరా నిలిపేశారు. ఎప్పుడు కరెంట్ నిలిపేయాలో, ఎప్పుడు సరఫరా చేయాలో ప్రాధాన్యతను గుర్తించి విద్యుత్ అధికారుల తీరును పలువురు తీవ్రంగా తప్పు బట్టారు. డీటీఆర్(ట్రాన్స్‌ఫార్మర్)కు అంతరాయంగా ఉన్న చెట్లును నరికి వేసే క్రమంలో పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో కరెంట్ సరాఫరా నిలిపేశామని లైన్‌మెన్ తిరుపతి తెలిపారు. సీఎం ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఉందన్న విషయం తాను గమనించలేదన్నారు.

విద్యుద్ఘాతానికి గురై మూగజీవాల మృత్యువాత

నవతెలంగాణ-లక్ష్మణచాంద



విద్యుద్ఘాతానికి గురై మూగజీవాలు మృత్యువాత పడ్డ సంఘటన మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తెగిపడి రెండు గేదెలు, ఒక పెంపుడు కుక్క మృత్యువాత పడ్డాయి. మండల కేంద్రానికి చెందిన అనుముల ఎల్లన్నకు చెందిన గేదె, అగ్గ మహేందర్‌కు చెందిన గేదె, బొజ్జ అజయ్ పెంపుడు కుక్కలు ఉన్నాయి. ఒక్కో గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, పెంపుడు కుక్క విలువ రూ.20 వేలుగా నిర్ధారించినట్లు సర్పంచ్ ముత్యంరెడ్డి, పశువైద్యాధికారి అజయ్ తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎన్నికల సిబ్బందికి ప్రశంసాపత్రాలు



నవతెలంగాణ-వేమనపల్లి

తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో భాగంగా బెల్లంపల్లి నియోజకవర్గంలోని వేమనపల్లి మండలంలో విధులు నిర్వర్తించిన సిబ్బందికి అదనపు కలెక్టర్ బెల్లంపల్లి ఎన్నికల అధికారి బి.రాహుల్ గురువారం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు పంచాయితీ కార్యదర్శులకు అందించారు. పంచాయతీ కార్యదర్శులకు, బీఎల్‌లోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ముఖ్యంగా ఎంపీడబ్ల్యు వర్కర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సంధర్భంగా వారు మట్లాడుతూ ఎన్నికల సమయంలో విధులు నిర్వహించిన తీరు అద్భుతం, పోలింగ్ సిబ్బందికి చేసిన ఏర్పాట్లు అమోఘం అన్నారు. నివేదికలు సమర్పించడంలో గానీ, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు గానీ, వచ్చిన సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చాలా భాగా విధులు నిర్వహించారని అన్నారు. ఆదర్శ పోలింగ్ కేంద్రం నీల్వాయిలో పంచాయతీ కార్యదర్శి జాఫర్, ఫీల్డ్ అసిస్టెంట్ కిషన్, ఎంపీడబ్లు మహేష్‌ను శాలువాలతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో ఏపీఓ సత్యప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

నవతెలంగాణ-బెజ్జూరు

ముఖమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేపట్టడంతో గురువారం మండల కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. బాణాసంచాలు పేల్చుతూ స్వీట్లు పంపిణీ చేశారు. ఇన్ని సంవత్సరాల కల నెరవేరిందని, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో కొలువుదీరిందని, బెజ్జూరు రేంజ్‌లో అన్ని విధాలుగా అభివృద్ధికి మార్గం సులభమైందని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అన్నారు. సంబరాల్లో నాయకులు హనుమంతు, విష్ణుమూర్తి, దూస శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూడైస్ ప్లస్‌పై ఉపాధ్యాయులకు అవగాహన



నవతెలంగాణ-కౌటాల

యూడైస్ ప్లస్‌పై ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి సోమయ్య అవగాహన కల్పించారు. గురువారం మండలకేంద్రంలోని రైతువేదికలో అవగాహన సదస్సు ఏర్పాటుచేసి 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల, ఉపాధ్యాయుల వివరాలను యూడైస్ ప్లస్, ఐఎస్ఎంఎస్ ఆన్‌లైన్‌లో అప్డేట్ చేసి ఆదివారంలోగా ఎంఆర్‌సీ కార్యాలయంలో అందజేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో కౌటాల, చింతలమానెపెల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గావుడె హన్మంతు, గెడం నానాజీ, జయరాజ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

నవతెలంగాణ-నార్నూర్



చలికాల నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టాలని డా. రాంబాబు, హెల్త్ సూపర్‌వైజర్ చరణ్ దాస్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 44 మంది బాలికలకు వైద్య పరీక్షలు చేశారు. జ్వరం, జలుబు, దగ్గు, దురద ఉన్న వారికీ ఉచిత మందలు పంపిణీ చేశారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చలికాలంలో జాగ్రత్తగా ఉండాలని స్వెట్టర్లు ధరించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. వైద్యశిబిరంలో ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, వైద్య సిబ్బంది ఈశ్వర్, జంగుబాయి, పాఠశాల సిబ్బంది ఇందల్ సింగ్, శ్రీకాంత్, ఉజ్వల, సరిత ఉన్నారు.

తుఫాన్‌తో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తుపాను ప్రభావం కారణంగా నష్ట పోయిన రైతులకు గుర్తించి, సర్వే నిర్వహించి పత్తి కింటాళుకు రూ.20వేలు, కందికి రూ. పది వేలు, సోయాకు రూ. 10 వేల నష్టపరిహారం చెల్లించాలని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి చిలుక దేవిదాస్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల నుండి తుపాను ప్రభావం కారణంగా చేతికొచ్చే సమయంలో వర్షాల కారణంగా వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. పత్తి , కంది, సోయా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు బెజ్జంకి నర్సింగ్, గణపతి, సంతోష్, కిరణ్, రమేష్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా బెల్లూరు అయ్యప్ప ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బెల్లూరి అయ్యప్ప ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కన్నుల పండువగా జరిగింది. రెండు రోజులుగా బ్రహ్మశ్రీ ఫణతుల మేగరాజ్ శర్మ, అయ్యప్ప ఆలయ మాజీ ప్రధాన కార్యదర్శి ఈర్ల సత్యనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కడుత్తస్వామి కరుప్పస్వామి, కరుప్పాయమ్మలి విగ్రహలను ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కన్నుల పండువల ఈ క్రతువును నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బెల్లూరి అయ్యప్ప ఆలయ అధ్యక్షులు కుంటోజీ సూర్యకాంత్ స్వామి, ప్రధాన కార్యదర్శి దాముక రవీందర్ స్వామి, ఆలయ కోశాధికారి టీంగం నరేష్, అనిల్ దేశ్‌పాండే, చందా గణేష్, నగేష్, శరత్ రెడ్డి, సాయిరాజ్ పాల్గొన్నారు

విద్యుద్ఘాతంతో ఆవు మృత్యువాత



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండలంలోని దుర్గానగర్ కాలానిలో విద్యుద్ఘాతానికి గురై ఆవు మృతి చెందింది. బీఈడీ కళాశాల వెనుకల గల చేనులో కరెంట్ తీగలను తలగి ఆవు బుధవారం చనిపోయినట్టు పద్మాకర్ రైతు తెలిపారు. పంచనామ నిర్వహించిన పశువైద్యాధికారి డాక్టర్ దూద్‌రాం రాథోడ్ జెర్సీ ఆవు విలువల రూ. 75 వేలు ఉంటుందని తెలిపారు. గంగారెడ్డి తన చెనుకు కరెంట్ సరఫరాకు కరెంట్ తీగ వేశారు. అతని నిర్లక్ష్యం కారణంగా ఆవు చనిపోయిందని బాదిత రైతు ఆరోపిస్తూ మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్సై రహమతుల్లా తెలిపారు. ఫిర్యాదు మేరకు సదరు చెను యజమానిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ అమ్మాయికి కరాటేలో గోల్డ్ మెడల్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నల్గొండ జిల్లాలో నిర్వహించిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే టోర్నమెంట్ సెలెక్షన్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. 58 కిలోల విభాగం అండర్-17 పోటీల్లో గాయక్వాడ్ అనుష్క స్వర్ణ పతకం సాధించినట్టు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంతారావు తెలిపారు. గురువారం ఆమెను డీఈఓ ప్రణీత, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లుతో పాటు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలియజేశారు. రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కల్పన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజల సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం 9959226002 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రయాణీకులకు నాణ్యమైన సేవలను అందించడంలో భాగంగా డయల్ యువర్ డీఎంను చేపడుతున్నామని తెలిపారు.

ఫూలే పేరు పెట్టడం హర్షణీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్ రెడ్డి ప్రగతి భవన్ పేరును మహాత్మ జ్యోతిరావు ఫూలే ప్రజాభవన్‌గా మారుస్తున్నట్లు ప్రకటించడం హర్షించదగ్గ విషయమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాలీ మహా సంఘం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫూలే దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని, వారు చేసిన సేవలకు గుర్తింపుగా ప్రగతి భవన్‌కు పేరు పెట్టడం సార్థకత చేకూరిందన్నారు. రాబోయే రోజుల్లో జ్యోతిరావు ఫూలే వారసులైన మాలీ కులస్తులకు ఈ రాష్ట్రంలో మంచి రోజులు రాబోతున్నాయని, ఇకనైనా ప్రభుత్వాలు గుర్తించి ఫూలే వారసుల సామాజిక సమస్యపై స్పందించి వెంటనే మాలీలకు ఎస్టీ హోదా కల్పించి సామాజిక న్యాయం చేకూర్చాలని కోరారు. రాబోయే రోజుల్లో మాలీల న్యాయబద్ధమైన డిమాండ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆశిస్తున్నామన్నారు.

ఆదిలాబాద్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు రవికుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చెయ్యాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జి బండారు రవికుమార్ అన్నారు. గతంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎన్నికల సభలో బీజేపీని గెలిపిస్తే సీసీఐని పునరుద్ధరణ చేస్తామని హామీనివ్వగా జిల్లా ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఎన్నుకోవడం జరిగిందని, పార్లమెంటు సమావేశాల్లో సీసీఐని ప్రారంభిస్తూ నిర్ణయం తీసుకుని అమలు చేయ్యాలని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ముందుగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ ప్రభుత్వానికి ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలకు పార్టీ జిల్లా కమిటీ తరఫున అభినందనలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలు దిశగా కార్యాచరణ రూపొందించాలన్నారు. అలాగే ఎయిరోడ్రమ్ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. హామీల అమలుకు పార్లమెంట్ సమావేశాల్లోనే నిర్ణయాలు చేయ్యాలని బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆరు గ్యారెంటీలు క్షేత్రస్థాయిలో అమలు చేయాలి..

జిల్లాలో వర్షాలు, తుఫాను కారణంగా పత్తి, శనగ, కందులకు నష్టం వాటిల్లిందని, పత్తి పంట పసుపు రంగుకు మారడంతో అధికారులు పత్తిని కొనుగోలు చేయడం లేదన్నారు. క్వాలిటీ సమస్య అనేది పరిగణంలోకి తీసుకోకుండా కొనుగోలు చేయాలన్నారు. శనగ, కందులు నష్టం జరిగిందని పూర్తి మద్దతు ధరను రైతులకు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఇంజనీరింగ్ కళాశాల తరగతులను వెంటనే ప్రారంభించాలని, కళాశాల నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆత్రం కిష్టన్న, బొజ్జ ఆశన్న, ఆర్ సురేందర్, మంజుల, ఎం.గంగన్న పాల్గొన్నారు.

ఆదివాసీ అమరుల జ్ఞాపకార్థం స్మృతి వనం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



హీరాపూర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద మొక్కలు నాటుతున్న కలెక్టర్, అధికారులు, నాయకులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

జల్ జంగల్ జమీన్ ఉద్యమించి అమరులైన వారిని స్మరించుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇంద్రవెల్లి మండలం హీరాపూర్‌లో 1981 సంవత్సరంలో నిర్మించిన అమరవీరుల స్థూపం వద్ద స్మృతివనం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామనిజిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించినంతరం గ్రామ సభలో స్మృతివనం ఏర్పాటుకు తీసుకోవలసిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులకు పలు ఆదేశాలు జరీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ 1981లో జల్ జంగిల్ జమీన్ కోసం పోరాడి అమరులైన 15 మంది ఆదివాసీ గిరిజన బిడ్డల జ్ఞాపకార్థం స్మృతి వనం ఏర్పాటుకు సర్వం సిద్ధం చేయాలన్నారు. ప్రహారీ గోడతో పాటు ఫౌంటేన్, వివిధ అభివృద్ధి పనులపై గ్రామపంచాయతీ ద్వారా తీర్మాణం చేసి కలెక్టర్‌కు అందించారు. కుమురం భీం జిల్లాలోని జోడేఘాట్‌లో చేపట్టిన మ్యూజీయం మాదిరిగా ప్రణాళికలు చేయాలని ఐటీడీఏ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. సర్వే నంబర్ 240లోని ఒక ఏకరం భూమిపై సర్వేచేసి పూర్తి రిపోర్టును అందించాలని తహసీల్దార్‌కు కలెక్టర్ సూచించారు. అనంతరం చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై ఆదివాసీ నాయకులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అమరవీరుల సంస్మరణ స్తూపం ఆవరణలో అధికారులు, ఆదివాసీ నాయకులతో కలిసి మొక్కలను నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిషన్, ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ప్రవీణ్, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, ఎంపీపీ శోభ, మెస్రం నాగనాథ్, పటేల్ వెంకట్‌రావ్ పాల్గొన్నారు.

మండలాల్లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలో గురువారం యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా బట్టి విక్రమార్క ప్రమాణ స్వీకారం చేసినందుకు టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. అధికారం చేపట్టిన తరువాత ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటిలను అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ వామన్, ఎంపీటీసీ నగేష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంజీవ్ గుండావార్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు ఘన్‌శ్యామ్, రూప్‌రావు, బోక్రే శంకర్, విపిన్ రాక్రె, అవినాష్ గోడే పాల్గొన్నారు.

సిరికొండ : తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకరం చేయడంతో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. గురువారం మండల కేంద్రంలో టపాకాయలు కాల్చి మిఠాయిలను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలపై తొలి సంతకం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం మరింత అభివృద్ధి ముందుకెళ్తుందని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రంజాన్, అనిల్, పాండు, బషీర్, దేవి, రాజారాం, నాగోరావ్ పాల్గొన్నారు.



సిరికొండలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు



తాంసి: సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

తాంసి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో మండలంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని బండల్ నాగపూర్, పోన్నారి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. బండల్ నాగపూర్‌లో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టపాలుసులు పేల్చి కార్యకర్తలు, అభిమానులు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా విలాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, ఆరు గ్యారంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. గెలుపుకు కష్టపడిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఏ నమ్మకంతో అయితే కాంగ్రెస్‌ని గెలిపించారో అదే స్ఫూర్తితో ప్రజల కోసం పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోజారెడ్డి, నర్సింగ్, అశోక్ రెడ్డి, రవిందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టీఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేగా గెలిచిన పాయల్ శంకర్‌ను గురువారం ఆయన నివాసంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో అమలు చేసే సంక్షేమ పథకాలలో మాదిగ ఉపకులలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సంఘం సభ్యులు కోరారు. సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇచ్చేలా తన వంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ మాదిగ, అధికార ప్రతినిధి నక్క రాందాస్ మాదిగ, సీనియర్ నాయకులు మోతే బారిక్ రావు మాదిగ, లింగంపెల్లి ప్రసన్న కుమార్, కత్తి గంగాధర్ మాదిగ, ముక్కెర అశోక్ మాదిగ, గొడ్కే మధుకర్, జంలే సంజయ్, బుమన్న మల్లయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

కొత్త ప్రభుత్వానికి అభినందనలు తెలిపిన ఎంపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి, సహచర మంత్రివర్గానికి ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఢిల్లీ నుండి ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ప్రజల సంక్షేమం పట్టించుకోలేదని, మార్పు కోసం ప్రజలు ఈ ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసి ఓడించారన్నారు. కొత్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పనిచేయాలని, ముఖ్యంగా ఇంద్రవెల్లి స్మారక వనాన్ని ఏర్పాటు చేసి, ఆదివాసుల హక్కులను కాపాడాలని కోరారు. ఆదివాసుల ప్రధాన సమస్య పోడు భూములకు పట్టాలు, మారుమూల గ్రామాలకు రోడ్లు, తాగునీరు సాగునీరు మౌలిక వసతులు కల్పించాలని ఎంపీ కోరారు. కొత్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేరుస్తారన్న ఆశ ప్రజల్లో ఉందని ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ప్రభుత్వం నడుచుకోవాలన్నారు. ప్రభుత్వానికి తమ సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు.

ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలో ఎన్సీసీ క్యాడెట్లు, మాజీ సైనికులు విరాళాలను సేకరించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు విరాళాల సేకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుద్ధంలో వీర మరణం పొందిన, తీవ్రంగా గాయపడిన సైనికుల కుటుంబాల సంక్షేమం కోసం విరాళాలను కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ కార్యాలయానికి పంపిస్తామన్నారు. సైనికుల సంక్షేమ నిధికి విరాళాలు ఇవ్వడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ప్రజలు తమ సాయాన్ని నగదు, యూపీఐ స్కానింగ్, చెక్కుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ కారుణ్య కాలాంజి, మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్ దాస్, కెప్టెన్ మజార్ హుస్సేన్, మాజీ సైనికులు గడ్డం అశోక్, ఆరే దేవన్న పాల్గొన్నారు.

పశువుల యజమానులకు నష్టపరిహారం



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి గ్రామానికి చెందిన పశువులు పులి దాడిలో గాయపడి మరణించిన పశువుల యజమానులకు అటవీశాఖ తరపున మంజూరైన నష్టపరిహారం డీడీలు అటవీ శాఖ అధికారులు అందజేశారు. గురువారం బాదితులకు డీడీలను అందించి బాదిత కుటుంబాలకు పరామర్శించారు. బాధితులు సురేష్‌కు రూ. 30 వేలు, ఎల్లన్నకు 8 వేలు, వసంతరావుకు రూ.12 వేలు, ఆడే తులసి రామ్‌కు రూ. 7500ల డీడీలను అందజేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారి హమీద్ ఖాన్ మాట్లాడుతూ పిప్పల్‌కోటి పరిసర ప్రాంతాలలో పులి సంచరించి పశువులపై దాడి చేసి హతమార్చిందన్నారు. బాదిత కుటుంబాలకు అటవీశాఖ తరపున నష్టపరి పరిహారం అందించడం జరిగిందని పేర్కొన్నారు. పిప్పల్‌కోటి, గొల్లఘాట్, తాంసి-కే పరిసర ప్రాంతాలలో పులి సంచారం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

వ్యవసాయ కళాశాలలో నేలల దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

వ్యవసాయ కళాశాలలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సహంగా పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డిన్ శ్రీధర్ చోహన్ మాట్లాడుతూ వ్యవసాయ క్షేత్రం ప్రదర్శన, భూ పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం దత్తత గ్రామం జైనథ్ మండలం సిరిసన్న గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి నేల సంరక్షణ పద్ధతుల గురించి వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో డా.రాజేశ్వరి, భాను రేఖ, అనిత, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రహణ మొర్రి ఉచిత శిబిరానికి స్పందన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రహణ మొర్రి సమస్యతో బాధపడుతున్న వారికి ఉపశమనం కల్పించేందుకు అవసరమైన ఆపరేషన్‌లను ఉచితంగా చేస్తున్నట్లు బసవతారకం ఇండో అమెకరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ముకుందరెడ్డి తెలిపారు. బాధితులను పరీక్షించేందుకు గురువారం పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గ్రహణ మొర్రితో బాధపడుతున్న వారికి పలు పరిక్షలు జరిపారు. బాధితులు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు బసవ తారకం ఇండో అమెకరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆపరేషన్ చేయడంతో పాటు దారి ఖర్చులు, భోజన వసతి కల్పిస్తామన్నారు. పండ్ల వరస సరిగా లేకపోయినా శస్త్ర చికిత్సలు చేస్తామని తెలిపారు.

ముగిసిన బోర్లకుంట జాతర

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామ సమీపంలోని బోర్లకుంట దవాల్ మాలిక్ జాతర ముగిసింది. మూడు రోజులుగా నిర్వహిస్తున్న బోర్ల కుంటా ధవల్ మాలిక్ బాబా జాతర గురువారంతో ముగిసింది. ధవాల్ మాలిక్ బాబాను దర్శించుకున్న భక్తులు మలిద, కిచడి నైవేద్యంగా సమర్పించారు. మండలంలోని నిపాని, పిప్పల్ కోటి, తాంసి-కే, గోల్లఘాట్ నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు బాబాకు చాదర్ సమర్పించారు. జాతరకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు షేక్ కాసిం, డేగే నారాయణ, షేక్ అఫ్రొజ్, షేక్ అరిఫ్, కేమా రాజన్న,షేక్ రషీద్ ఉన్నారు.

4

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కుమురంభీం ఆసిఫాబాద్

శుక్రవారం | డిసెంబర్ 08, 2023 | www.navatelangana.com

ప్రమాణ స్వీకారానికి వెళ్లిన నాయకులు

నవతెలంగాణ-జన్నారం



తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవానికి గురువారం మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ ఎల్బీ స్టేడియానికి భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీములను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తుంది అన్నారు. తరలి వెళ్ళిన వారిలో జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, దాముఖ కరుణాకర్, అల్లం వెంకటరాజం, నందు నాయక్, పసియుల్లా, ఇంద్రయ్య రమేష్, రియాజ్, మాణిక్యం, నందన్న రాజన్న, గంగన్న ఉన్నారు.

సబ్బెపల్లి ఉన్నత పాఠశాల సందర్శన

నవతెలంగాణ-హాజీపూర్



జడ్పీహెచ్ఎస్ సబ్బెపల్లి పాఠశాలను గురువారం ఎస్సీ ఈఆర్టీ అధికారులు కే.రవి కాంత్ రావు ఆధ్వర్యంలో సందర్శించారు. పాఠశాలలో అమలు జరుగుతున్న ఉన్నతి కార్యక్రమం అమలు తీరు, 10వ తరగతి విద్యార్థుల లక్ష్యం తదితర కార్యక్రమాల గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందంతో సమావేశమై బోధన అభ్యసన కార్యక్రమం గురించి పలు సూచనలు చేశారు. పాఠశాలలో ఉన్నతి కార్యక్రమం అమలుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి చౌదరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధారాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మళ్లీ పెరిగిన కలప స్మగ్లింగ్..?

- కొరవడిన అటవీ అధికారుల నిఘా

నవతెలంగాణ-జన్నారం



జన్నారం అటవీ డివిజన్ పరిధిలో కలప స్మగ్లింగ్ మళ్లీ జోరందుకుంది. గుట్టు జప్పుడు కాకుండా రాత్రి వేలలో కలప దుంగల తరలిస్తున్నారు. డివిజన్లో గత కొంత కాలంగా నిలిచిపోయిన కలప స్మగ్లింగ్ మళ్లీ మొదలైదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇటీవల మందపల్లిలోని ఓ ఇంట్లో నుంచి టేకు దుంగలు తీసుకు వెళ్లినట్లు అటవీ అధికారులకు స్థానికులు సమాచారం ఇవ్వగా అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి వెళ్లిపోయారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో అదే ఇంట్లో ఎనిమిది దుంగలను పట్టుకున్నారు. కొంత మంది అధికారుల సహకారంతో కలప స్మగ్లింగ్ మళ్లీ జోరందుకుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దట్టమైన అడవులు, అత్యధిక టేకువనం

వన్యప్రాణుల పరుగులు, పక్షుల కిలకిలరావాలకు చిరు నామా.. కవ్వాల్ టైగర్ జోన్, దట్టమైన అడవులు పులులకు అవాసాలుగా ఉండటంతో కవ్వాల్ అభ యరాణ్యాన్ని 2012లో టైగర్ జోన్గా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అధికారుల ప్రత్యేక నిఘా ఏర్పాటుతో కలప తరలిపోకుండా, వన్యప్రాణుల వేట తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా తగ్గిన కలప స్మగ్లింగ్ ఇటీవల మళ్లీ పెరిగినట్లు ఇటీవల జరిగిన పలు సంఘటనల ద్వారా స్పష్టమవుతోంది.

ఇస్లాంపూర్ నుంచి కవ్వాల్ మీదుగా

ఇస్లాంపూర్ నుంచి కవ్వాల్ మీదుగా కలపను ఇతర ప్రాంతాలకు వెళ్తుంది. గత నాలుగు నెలల క్రితం ఇస్లాంపూర్కు చెందిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా కలప తరలిస్తుండగా కవ్వాల్లో ఆటవీ అధికారులు పట్టుకుని ట్రాక్టర్ను సీజ్ చేశారు. అదేవిధంగా వారానికే మరో ట్రాక్టర్ ద్వారా కలప తరలి స్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటనలను పరిశీలిస్తే స్మగ్లింగ్ పెరిగినట్లు తెలుస్తోంది.

వాహనాల ద్వారా తరలింపు

జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని కవ్వాల్, చింతగూడ, బొమ్మెన, తపాలాపూర్, రేండ్లగూడ, తదితర ప్రాంతాలను ఎంచుకుని కలప ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రేండ్లగూడలో ఒక ఇంట్లో ఆరు టేకుదుంగలు పట్టుబడినట్లు ఆలస్యంగా తెలిసింది. ఇస్లాంపూర్, కవ్వాల్ గ్రామాలకు చెందిన కొందరు రాత్రి వాహనాల ద్వారాసైజులుగా చేసి కలప తరలిస్తున్నట్లు పలువురుచెబుతున్నారు. అర్ధరాత్రి నుంచి తెల్లారి మూడు గంటల వరకు వాహనాల ద్వారా కలప తరలిపోతు న్నట్లు గ్రామాలలో జోరుగా చర్చ సాగుతోంది. ఈ విషయంపై రేంజ్ అధికారి హఫీజొద్దీన్‌ను సంప్రదించగా చెక్‌పోస్టుల వద్ద, పెట్రోలింగ్ ద్వారా నిఘా పెట్టామని, కలప తరలిపోతున్నట్లు తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని కిందిస్థాయి సిబ్బందిని హెచ్చరించినట్టు తెలిపారు.

అధికారి బదిలీతో తగ్గిన నిఘా

జన్నారం అటవీ డివిజన్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సిరిపురం మాధవరావు తనదైన శైలిలో వ్యవ హరించి డివిజన్ స్మగ్లింగ్ను నిరోధించారు. నిర్ల క్ష్యం వహించిన సిబ్బందిపై వేటు వేశారు. స్మగ్లింగు పాల్పడేవారిని బైండోవర్ చేశారు. రాత్రి పెట్రో లింగ్, నాకాబందీ, గ్రామాల్లో దాడులు నిర్వహించడం, డాగ్స్క్వాడ్తో కలపను పట్టుకోవడం లాంటి చర్యలు తీసుకున్నారు. దీంతో గత మూడేళ్లుగా క లప స్మగ్లింగ్ జన్నారం డివిజన్‌లో తగ్గింది. స్మగ్లర్లు కొందరు సిబ్బంది ఆయన బదిలీ ఎప్పుడు అవుతాడో అని చూశారు. నాలుగున్నరేళ్ల పనిచేసిన ఆయన గత సెప్టెంబర్‌లో బదిలీ అయ్యాడు. కాచుకుని కూర్చున్న స్మగ్లర్లు రెచ్చిపోతున్నట్లు తెలుస్తోంది.







గ్రామపంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం కావాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

గ్రామపంచాయతీల ఎన్నికల ప్రక్రియ మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు, ఉద్యోగులు సంసిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్ ఆదేశించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాదిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మౌళిక వసతులు కల్పించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయం, ర్యాంపులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రకటన వెలుబడక ముందే పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని చెప్పారు. ఎంపీఓ గౌరీశంకర్, ఏపీఓ సోహెబ్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు, సాంకేత సలహాదారులు, క్షేత్రసహాయకుల పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం తప్పుడు ప్రచారం

- ఎంపీపీ దుబ్బుల నానయ్య



నవతెలంగాణ-చింతలమానేపల్లి

గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో ఎంపీపీపై అవిశ్వాస తీర్మాణం పెడుతున్నట్టు బూటకపు ప్రచారం చేస్తున్నారని ఎంపీపీ దుబ్బుల నానయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ పదవిపై అవిశ్వాస తీర్మానం చేస్తున్నట్లు వస్తున్న వార్తలు బూటకమని, అంతా అబద్ధమని అన్నారు. కొందరు బీజేపీ నాయకులు బీఎస్పీ నాయకులు మా పై తప్పుడు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఈది పూర్తి అవాస్తమని అన్నారు. ఎంపీటీసీలు అందరూ కోనేరు కోనప్ప వెంటే ఉంటారని బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన వాళ్ళు ఎవరు డబ్బులకు, పదవులకు లొంగరని అన్నారు. ఆయనతోపాటు కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నాజీమ్ హుస్సేన్, ఎంపీటీసీలు జాబర్ రాజన్న, జాటోత్ ధనరాజ్ ఉన్నారు.

పల్లెప్రగతి, ఉపాధి హామీలపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-వేమనపల్లి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ లక్ష్మయ్య అధ్యక్షతన పల్లెప్రగతి, ఉపాధి హామీ చట్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అమ్బుడ్స్ మెన్ కామెర శివరాం మాట్లాడుతూ ఉపాధి హామీలో వచ్చిన అన్ని రకాల ఫిర్యాదులకు పరిష్కార మార్గాలు, వివరణలు తెలియ చేశారు. అదేవిధంగ మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై ఫీల్డ్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. గ్రామ పంచాయతీలో 100 శాతం పన్నులు వసూలు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో కూలీలను పెంచాలని నర్సరీ పనులు వేగవంతం చేయాలని కొత్త పనుల ఎంపిక పూర్తి చేయాలని ఏపీఓ సత్య ప్రసాద్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు కంప్యూటర్, ఆపరేటర్లు, పంచాయతి కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కౌటాల

విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం ఉంటుందని ఏఈ రవీందర్ తెలిపారు. ఈజ్‌గాం 130 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు చేయనుండగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, సిర్పూర్, కౌటాల, చింతలమానెపెల్లి, బెజ్జూరు మండలాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరినట్టు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కౌటాల

కంకలమ్మ జాతర సందర్భంగా కంకలమ్మ కాలసూచికను ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య ఆధ్వర్యంలో కాలసూచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉప్పుల సత్తయ్య, కౌటాల ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, అల్లాడి రాములు, బండి రాజేందర్‌గౌడ్, సుల్వ కళ్యాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రయోగాత్మకంగా విద్యను బోధించాలి

- కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శంకర్‌గౌడ్



నవతెలంగాణ-దండేపల్లి

దండేపల్లి, జన్నారం, లక్షట్టిపేట మండలాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు దండేపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం కాంప్లెక్స్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాల ఆధారంగా ప్రణాళికలు ప్రయోగాల ద్వారా బోధిస్తే విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటారని నైపుణ్యాలతో కూడిన విద్యను బోధించాలని ఆయన సూచించారు. జన్నారం మండలానికి చెందిన ఉపాధ్యాయుడు రాజయ్య ప్రయోగం ద్వారా పాఠాన్ని సమావేశంలో బోధించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ పాత రమేష్, సీఆర్పీ గరిగే నర్సయ్య, మూడు మండలాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు



నవతెలంగాణ-నస్పూర్

దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరాంపూర్ ఏరియా వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో గురువారం శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో శ్రీరాంపూర్ పరిసరాలలో ఉన్న వివిధ పాఠశాలల నుంచి వచ్చిన దివ్యాంగ విద్యార్థిని, విద్యార్థులకు వివిధ రకాల అటల పోటీలను నిర్వహించారు. ఈ ఆటల పోటీలలో గెలుపొందిన వారికి శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓ టూ జీఎం రఘు కుమార్ చేతుల మీదుగా బహుమతులను, పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు అరవింద్ రావు, ఆనంద్ కుమార్, సీనియర్ పీఓ కాంతారావు, స్పోర్ట్స్ హనరరీ సెక్రటరీ పాలకుర్తి రాజు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ బాధితుడికి అప్పగింత

నవతెలంగాణ-కౌటాల

చింతలమానేపెల్లి మండలంలోని రవీంద్రనగర్ గ్రామానికి చెందిన అనిల్ మండల్ ఇటీవల కౌటాల మండలంలోని బోదంపెల్లి గ్రామ శివారులో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు సీఈఐఆర్ పోర్టల్లో మీసేవలో ఫిర్యాదు చేసి సంబంధిత కాపీలను కౌటాల ఎస్సైకి ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సై మధూకర్ ఫోన్ సెర్చ్ చేసి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పటుకుని గురువారం బాధితుడికి అప్పగించారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను దొరకపట్టి ఇచ్చినందుకు బాధితుడు ఎస్సైకి ధన్యవాదాలు తెలిపారు.

ఏఐటీయూసీతోనే కార్మిక హక్కులు సాధ్యం

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)తోనే కార్మిక హక్కులు సాధించుకోవచ్చని రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన ఆర్కే-5బిలో నిర్వహించిన గేట్ మీటింగ్ సమావేశానికి హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థ మనుగడ గత గుర్తింపు కార్మిక సంఘం వైఫల్యం వల్ల ప్రశ్నార్థకంగా మారిందని కార్మికుల హక్కులు సాధించడంలో వైఫల్యం చెందిందన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు డిసెంబర్ 27న జరుగుతున్న సందర్భంగా కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టిన చరిత్ర కలిగిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)ని ఆదరించాలని, సింగరేణి సంస్థ పరిరక్షణకు దోహద పడిన వాళ్ళం అవుతామన్నారు. సింగరేణి సంస్థలో భవిష్యత్తు ఉండాలంటే ఎర్రజెండా యూనియన్ ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలవడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. భవిష్యత్తులో కార్మికుల నూతన హక్కుల కోసం, గతంలో సాధించిన హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలవడం ద్వారా అనేక సంవత్సరాలుగా కార్మికులు ఎదురుచూస్తున్న సొంతింటి పథకం అమలుకు కృషి చేస్తామని, కోల్ ఇండియాలో కార్మికులకు చెల్లిస్తున్నటువంటి అలవెన్సుపై ఐటీ మినహాయింపు సింగరేణి కార్మికులకు కూడా యాజమాన్యమే చెల్లించే విధంగా చేస్తామన్నారు. ఈ సందర్భంగా వివిధ యూనియన్లకు సంబంధించిన కార్మికులు సీతారామయ్య సమక్షంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్లో చేరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఫిట్ కార్యదర్శిలు గునిగంటి నర్సింగారావు, విశ్వనాథ్‌రెడ్డి, సత్తిరెడ్డి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, కిష్టయ్య, లక్ష్మణ్, రవీందర్, విజయ్ పాల్గొన్నారు.

కంకాలమ్మ జాతర ప్రారంభం

నవతెలంగాణ-కౌటాల



మండలకేంద్రంలోని కంకాలమ్మ గుట్టపై స్వయంభుగా వెలిసిన శ్రీ కేతేశ్వర కంకలమ్మ జాతర గురువారం నుంచి ప్రారంభించినట్టు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ సుల్వ కనకయ్య తెలిపారు. గురువారం నుంచి 12వ తేదీ వరకు జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. గురువారం క్షేత్రాది దేవతల ప్రత్యేక పూజా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎనిమిదిన అమ్మవారికి చెక్రానఆవర్ణ, కుంకుమార్చన, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. తొమ్మిదిన దేవస్థాన వార్షికోత్సవం, శ్రీ కంకలమ్మ దేవీ మహాయజ్ఞం, 10న అమ్మవారికి రథచక్రం మహాభిషేకం, అలంకరణ చేసి దర్శనానికి భక్తులను అనుమతించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. 11న అమ్మవారికి అభిషేకం, అర్చన, 12న అమ్మవారికి అభిషేకం, అలంకరణ, రామాయణ పార్కురి భజన, గోపాలకాల, ప్రతిరోజు భక్తులకు తీర్థప్రసాదాలు అందించనున్నట్టు తెలిపారు. జాతర మహోత్సవాల్లో ఉత్తర్‌ప్రదేశ్ బృందావనానికి చెందిన శివరామస్వామి, మహారాష్ట్ర డాబాకు చెందిన తులసీరామేశ్వర్ స్వామితో పాటు వివిధ ప్రాంతాల నుంచి స్వామీజీలు పాల్గొనన్నుట్టు పేర్కొన్నారు.



జాతర ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

కంకలమ్మ జాతరకు బారీగా జనం తరలివస్తారని విషయం తెలుసుకొని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ కౌటాల సీఐ సాదిక్‌పాషాతో కలిసి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆలయ చైర్మన్ సుల్వ కనకయ్యతో కలిసి జాతరకు సుమారుగా వేలాది మంది వరకు భక్తులు రావొచ్చని, వారందరికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లను కల్పించాలని ఆయనకు సూచించారు. బారీ పోలీసు బందోబస్తును నిర్వహించాలని సీఐ సాదిక్‌పాషాకు సూచించారు. ఆయన వెంట ఎస్సై మధూకర్ ఉన్నారు.